క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మాసాంతపు మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏడీఈ కొండలరావు బుధవారం తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాలు, తుమ్మలపాలెం గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు గిరిప్రదక్షణ



మెట్టగుట్ట/ పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శ్రీశేషాచల శ్రీనివాసస్వామి సన్నిధిలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం గిరిప్రదక్షణను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జొన్నల ప్రతాపరెడ్డి తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఛత్ర, చామర, మంగళవాయిద్యాలతో స్వామి గిరిప్రదక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. దీనికై అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం 11గంటల నుంచి భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు.

వాటర్ ప్యూరిఫయర్ అందజేత




మైలవరం: స్థానిక లయన్స్ క్లబ్ ట్రెజరర్ తిమ్మన దినేష్‌బాబు మాతృమూర్తి తిమ్మన వెంకట రమణ జ్ఞాపకార్థం స్థానిక భవిత కేంద్రంలోని మానసిక వికలాంగ విద్యార్థులకు కూలింగ్ వాటర్ ప్యూరిఫయర్ సిస్టమ్‌ను పుర ప్రముఖులు కఠారి ఉమామహేశ్వరరావు ద్వారా బుధవారం అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ ఎల్.బాలు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల కేంద్రానికి వాటర్ సిస్టమ్ అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ మైలవరం అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ లేళ్ల ఏడుకొండలు, కార్యదర్శి చలువాది గుప్తా హరీష్, తిమ్మన దినేష్‌బాబు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల పంపిణీ



రోలుపడి(తిరువూరురూరల్): మండలంలోని రోలుపడి పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను సర్పంచ్ ముండ్లపాటి కాంతమ్మ బుధవారం పంపిణీ చేశారు. గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో గతంలో గ్రామసభల్లో దరఖాస్తు చేసిన అర్జీదారులకు ఈ రేషన్‌కార్డులను అందజేశారు. ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్ బండి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు డైరెక్టరు బండి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటరత్నం, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వేంకటాచలస్వామికి సహస్రదీపాలంకరణ సేవ



తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి దేవస్థానంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా బుధవారం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో వైష్ణవగోష్టి భక్తబృంద సభ్యులు సహస్రదీపాలంకరణలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి పవళింపు సేవ నిర్వహించారు.

అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పాలన

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



తోలుకోడు గ్రామంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

తోలుకోడు(మైలవరం): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం తోలుకోడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరిగింది. గ్రామ సచివాలయాల ఏర్పాటు చేసి ప్రజల ముందుకు పాలన తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. రైతులకు ఆర్బీకేలు, ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్న వైఎస్సార్ ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. మహిళల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. పిల్లలను బాగా చదివించుకుని ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించాల్సిందిగా అధికారులకు సూచించారు. సంక్షేమ పథకాల అమలులో వివక్షకు తావులేదన్నారు. జగనన్న పాలనలో అర్హతలే ప్రామాణికాలన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మైలవరం: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం దేవుని చెరువులో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రహదారులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైలవరం దేవుని చెరువులో రూ.1.30 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. నిధుల సౌలభ్యత, సమస్యల తీవ్రతను బట్టి అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మైలవరం బందర్ రోడ్డులో సిమెంట్ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ

నూజివీడు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వీధిలైట్లు, పారిశుద్ధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరా, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలో అంతర్గత రహదారులను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. వార్డుల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రీయ విద్యాలయం పేరుతో రూ.80 లక్షల మున్సిపాలిటీ నిధులను ఖర్చుచేశారని, అసలు దానిని నూజివీడులో ఏర్పాటు చేస్తారా లేదా అని టీడీపీ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ ప్రశ్నించగా, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ బదులిస్తూ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపేందుకు బిల్డింగ్‌ను ముందుగానే సిద్ధం చేసి ఉంచాలని, ఇందులో భాగంగానే రూ.80 లక్షలతో ఎంప్లాయిస్ కాలనీలోని పాఠశాల భవనం పైన, పక్కన తరగతి గదులను నిర్మించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దక్షిణాదిరాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడులలో ఒక్క కేంద్రీయ విద్యాలయాన్ని కూడా మంజూరు చేయలేదని చెప్పారు. మంజూరు చేస్తే పర్మినెంట్ బిల్డింగ్‌లు నిర్మించే వరకు తాత్కాలిక భవనంలో నిర్వహిస్తామన్నారు. ఒకవేళ మంజూరవ్వకపోతే గదులను వేరే కార్యాలయాల ఏర్పాటుకు ఉపయోగిస్తామని, నిధులు వృథా జరగలేదని చెప్పారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు కౌన్సిలర్లతో కమిటీ వేసి పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, షేక్ మహబూబ్‌బీ పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ డిగ్రీ



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్న నిమ్రా పీడీ సత్తార్‌ఖాన్

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా విద్యాసంస్థ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ సత్తార్‌ఖాన్ నాగార్జున యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డిగ్రీ పొందారు. యూనివర్సిటీ 40వ స్నాతకోత్సవం సందర్భంగా హాజరైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బుధవారం పీహెచ్‌డీ డిగ్రీ పట్టా స్వీకరించారు. 'అసోసియేషన్ సెలెక్టెడ్ మోటార్ ఫిట్‌నెస్ ఫిజియాజికల్ అండ్ ఆంత్రోపొమెట్రిక్ వేరియేబుల్ విత్ ప్లేయింగ్ ఎబిలిటీ ఆఫ్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్' (బ్యాడ్మింటన్ క్రీడాకారుల శక్తిసామర్థ్యాలపై) అనే గ్రంథాన్ని యూనివర్సిటీకి అందజేసిన నేపథ్యంలో పీహెచ్‌డీ డిగ్రీ అందజేశారు.

ఎస్ఆర్ఆర్ హైస్కూల్ విద్యార్థులకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు



డీఈఓ చేతుల మీదుగా స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న హెచ్ఎం హేమలత

నూజివీడు: స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్ విద్యార్థులకు వరుసగా రెండోసారి స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు వచ్చినట్టు హెచ్ఎం భాగవతుల హేమలత బుధవారం తెలిపారు. ఏలూరు డీఈఓ పి.శ్యామ్‌సుందర్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డు పొందడంలో వ్యాయామోపాధ్యాయుల కృషి ఎనలేనిదని తెలిపారు. స్కూల్ గేమ్స్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఆడిన విద్యార్థుల నుంచి పాయింట్ల ఆధారంగా ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. వ్యాయామోపాధ్యాయులు అన్నామణి, లక్ష్మీ, వనజలతో పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వాకా నాగరాజును అభినందించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ దారా మోహన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చిన వైఎస్సార్ సీపీ నాయకుడు



తోటపల్లిలో రోడ్డుపై గుంతలను పూడ్చివేస్తున్న దృశ్యం

నూజివీడు(ఆగిరిపల్లి): మండలంలోని తోటపల్లిలో ఆగిరిపల్లి - గన్నవరం ప్రధాన రహదారిపై వర్షాల కారణంగా గుంతలు పడటంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బెజవాడ రాంబాబు, యువజన విభాగం మండల అధ్యక్షుడు బెజవాడ శ్రీహర్షలు కలిసి బుధవారం గోతులను పూడ్చారు. గోతుల్లో 60 టన్నుల వెట్‌మిక్స్‌ను పోయించి చదును చేయించారు. దీంతో ఈ మార్గం రాకపోకలకు సంబంధించి ఇబ్బందులు తొలగాయి. గోతులను పూడ్పించిన వైఎస్సార్ సీపీ నాయకులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో తోటపల్లి దుగ్గిరాల బాలరావమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ వీరంకి వీరాంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు నాగబాబు, గ్రామ అధ్యక్షులు పామర్తి శివ పాల్గొన్నారు.

రూ.6.19 కోట్ల రుణాల పంపిణీ

తిరువూరు: స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో డ్వాక్రా మహిళలకు రూ.6.19 కోట్ల రుణాలను బుధవారం ఆ బ్యాంకు రీజినల్ మేనేజరు శివరాంప్రసాద్ పంపిణీ చేశారు. పీఎంజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై, ఆర్.డీ, వీఆర్‌డీ తదితర పథకాల ద్వారా సప్తగిరి గ్రామీణ బ్యాంకు రుణాలను అందిస్తోందన్నారు. రిటైర్డు బ్యాంకు ఏజీఎం వెంకటేశ్వరరావు బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. వావిలాలకు చెందిన జీ స్వప్నకు ప్రమాదబీమా కింద రూ.5లక్షల చెక్కును అందజేశారు.

ఈదలగూడెంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం హైస్కూల్లో బుధవారం ఇంగ్లిష్ సబ్జెక్టుపై స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. హెచ్ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లో పనిచేస్తున్న ఇంగ్లిష్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. నూజివీడులో జెడ్పీ బాలికల హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ ములగలేటి ఉమ రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఆగిరిపల్లి ఎంఈఓ-2 ఆనంద్ కుమార్ కాంప్లెక్స్ సమావేశాన్ని పర్యవేక్షించి, సలహా సూచనలు అందించారు.

తమ్మిలేరు నుంచి ఏటి కాలువకు నీరు విడుదల



ముసునూరు: గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం గ్రామాల వ్యవసాయ క్షేత్రాలకు తమ్మిలేరు నుంచి నీరందించే ఏటి కాలువకు పూడికతీత పనులు పూర్తికాగా నీరు విడుదల చేసినట్టు గ్రామ సర్పంచ్ ఆర్.శ్రీదేవి శ్రీనివాస్ తెలిపారు. ఏటి కాలువ పూడిక, తుంగ, తూడు, ముళ్ల పొదలతో నిండి పోయిన విషయాన్ని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జేసీబీతో పూడిక తీత పనులు చేయించారు. బుధవారం కాల్వ నీటి సంఘ అధ్యక్షుడు వలసపల్లి రామచంద్ర ప్రసాద్ రైతులతో కలిసి కాలువకు నీరు విడుదల చేశారు. మూడు గ్రామాల్లోని 1,500 ఎకరాల పంట పొలాలకు నీరందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వలసపల్లి సర్పంచ్ దామోదర్, ఉప సర్పంచ్‌లు వేంపాటి పద్మజా రాంబాబు, డి.వి. సుబ్బారావు, మండల పార్టీ సభ్యుడు సురేష్, గ్రామ కార్యదర్శి బి.నాగరాజు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ



నూజివీడులోని మైలవరం బస్టాప్ సెంటర్లో క్యాంటీన్‌ను ప్రారంభించిన చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ

నూజివీడు: గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే ప్రజల ఆకలిని తక్కువ ఖర్చుతో తీర్చేందుకు, మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యంలో పట్టణాల్లో ఆహా క్యాంటీన్లను ప్రారంభిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ తెలిపారు. నూజివీడులోని మైలవరం రోడ్డులోని బస్టాపు వద్ద మెప్మా ఆధ్వర్యంలో రాజా మహిళా గ్రూపు ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను బుధవారం చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.40లకే మినీ మీల్స్ తరహాలో వెజ్ రైస్, కరివేపాకు రైస్, లెమన్ రైస్, టమాట రైస్, ఆవకాయ రైస్, కర్డ్ రైస్ తదితర వాటిని అందిస్తారన్నారు. ప్రతి సామాన్యుడి ఆకలి తీర్చేందుకే దీనిని ఏర్పాటు చేశారని తెలిపారు. డిమాండ్‌ను బట్టి ఉదయం టిఫిన్‌లు, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం అందజేస్తారన్నారు. క్యాంటీన్‌ను నిర్వహించే డ్వాక్రా సంఘానికి ప్రభుత్వం రూ.13 వేలు ఆర్థిక సాయం అందజేస్తుందని, దానిని నెలకు రూ.500 చొప్పున తిరిగి చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, సీఎంఎం ఆనంద్, సీఓ నాగోజీ, ఆర్పీలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని



సడక్‌రోడ్డు పట్టణ ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలోని యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు వచ్చే ఓపీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. ఆమె బుధవారం కొండపల్లి సడక్‌రోడ్డులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు, పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పెరికెలపాడులో జరుగుతున్న కుటుంబ డాక్టర్ శిబిరాన్ని తనిఖీ చేశారు. ఓపీ రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, రికార్డులు నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ యస్‌జె లివింగ్ ఫెయిత్, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

అక్కపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్



తిరువూరు మండలం అక్కపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్

అక్కపాలెం(తిరువూరురూరల్): మండలంలోని అక్కపాలెంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. రాజుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు గ్రామంలోని పలు నివాసగృహాలకు వెళ్లి దీర్ఘకాలిక రోగులకు వైద్యసేవలందించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు.

ఆర్టీసీ బస్సును అడ్డుకున్న విద్యార్థులు



గోగులంపాడులో బస్సును నిలిపివేసిన విద్యార్థులు

ముసునూరు: తమ గ్రామానికి బస్సు నడపాలని కోరుతూ కళాశాలల విద్యార్థులు ఆర్టీసీ బస్సును అడ్డుకున్నారు. లోపూడి నుంచి నూజివీడు చింతలవల్లి, గోగులంపాడు మీదుగా వెళ్లే బస్సును కొంత కాలంగా అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, ముక్కొల్లుపాడు మీదుగా నడుపు తుండడంతో గోగులంపాడు, చింతలవల్లికి చెందిన పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోంది. ఇదే విషయాన్ని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదనతో నూజివీడు నుంచి లోపూడి వెళుతున్న బస్సును విద్యార్థులు బుధవారం గోగులంపాడులో అడ్డుకున్నారు. పోలీసులు ఆర్టీసీ అధికారులతో చర్చలు నిర్వహించారు. సమస్య పరిష్కరిస్తామని డిపో మేనేజర్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

రాఖీ పౌర్ణమి సందడి



తిరువూరులో రక్షాబంధన్ స్టాల్స్ వద్ద కొనుగోలుదారుల సందడి

తిరువూరులో..

తిరువూరు: రాఖీపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరువూరు పట్టణంలో ఏర్పాటు చేసిన రక్షాబంధన్ స్టాల్స్ బుధవారం కొనుగోలుదారులతో రద్దీగా ఉన్నాయి. సోదర భావానికి ప్రతీకగా తమ అన్నదమ్ములకు రక్షాబంధన్ కట్టేందుకు మహిళలు, బాలికలు మిఠాయిలు, రాఖీలు కొనుగోలు చేశారు. పట్టణంలోని బోస్ సెంటర్, చీరాల సెంటర్, బస్టాండు సెంటర్, ఫ్యాక్టరీ సెంటర్, జూనియర్ కాలేజీ సెంటర్, రేగుచెట్టు సెంటర్, జైబావి సెంటర్లలో ఆకర్షణీయమైన రాఖీలు అమ్మకానికి పెట్టారు.

చాట్రాయిలో..

చాట్రాయి: అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల చక్కనైన అనుబంధానికి ప్రతీకగా ఉన్న రాఖీ పండగతో బుధవారం మండలంలో సందడి నెలకొంది. గురువారం రాఖీ పర్వదిన సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో రాఖీ విక్రయాల దుకాణాలు ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో దుకాణాల వద్దకు చేరుకుని రాఖీలు, స్వీట్లు కొనుగోలు చేశారు.

అధికార పత్రాలలో తెలుగును వినియోగించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గిడుగు రామ్మూర్తి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవంగా ప్రకటించటం అభినందనీయమని బుధవారం అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు కె సుబ్బరాజు, ఎస్.వెంకటేశ్వరరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం అధికార పత్రాలలో తెలుగు భాషను వినియోగించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అలాగే హైకోర్టులలో తెలుగు భాషలో తీర్పులు వెలువడాలంటూ పత్రికాముఖంగా హైకోర్టు న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు.

డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి అంబేడ్కర్ నగర్‌లో డ్రెయినేజీల నిర్మాణానికి ఎంపీపీ పాలడుగు జోత్స్న బుధవారం భూమిపూజ చేశారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. రూ. 50 లక్షల వ్యయంతో నూతన డ్రెయినేజీల నిర్మాణం చేపడతామన్నారు. ఉప సర్పంచ్ మేరీ, వైఎస్సార్ సీపీ నాయకుడు దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా దర్గా ఉరుసు మహోత్సవం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో హజరత్ షేక్ దావులియా 129వ ఉరుసు మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గంధం ఊరేగింపు బ్యాంక్ సెంటర్ నుంచి బీకాలనీలోని దర్గా వరకు చేరింది. సూఫీ మతగురువు ఆల్తాఫ్‌రజా ముజావర్లతో కలసి బాబా వారికి గంధం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమ ఏర్పాటు చేశారు.

తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సహకరించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పష్టమైన తుది ఓటర్ల జాబితా ప్రచురణకు రాజకీయ పక్షాలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా రాజకీయపార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఢిల్లీరావు మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన విజయవంతమైందని చెప్పారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు.

3న బాలగోకులం పోటీలు

విజయవాడ కల్చరల్: సంస్కారభారతి విజయవాడ మహానగర్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం సత్యనారాయణపురం శిశువిద్యామందిర్‌లో బాలగోకులం పేరుతో చిత్రలేఖనం, శ్రీకృష్ణవేషధారణ, భగవద్గీత పఠన పోటీలు నిర్వహించనున్నట్లు సంస్కారభారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ బుధవారం తెలిపారు. 10 సంవత్సరాలలోపు బాల బాలికలకు శ్రీ కృష్ణవేషధారణ పోటీలు, 6వ తరగతి నుంచి 10వ తరగతి బాల బాలికలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సమరభేరిని జయప్రదం చేయాలి

తిరువూరు: నిరుద్యోగ సమస్య పరిష్కారం, అధికధరలను నియంత్రించాలని కోరుతూ సీపీఎం చేపట్టిన సమరభేరిని జయప్రదం చేయాలని ఆ పార్టీ తిరువూరు పట్టణ కార్యదర్శి ఎం.నాగేంద్రప్రసాద్ కోరారు. తిరువూరులో సమరభేరి ప్రచార కరపత్రాలను బుధవారం పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక సంక్షేమం, ప్రజా సంక్షేమ పథకాల అమలులో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎస్‌వీభద్రం, ఆకుల రవి, వెంకటేశ్వరరావు, వెంకటరత్నం పాల్గొన్నారు.

వ్యాయామోపాధ్యాయుల కాంప్లెక్స్ చైర్మన్ ఎన్నిక

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ వ్యాయామోపాధ్యాయుల స్పోర్ట్స్ కాంప్లెక్స్ మొదటి సమావేశం బుధవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. సందిగామ డీవైఈఓ వెంకటప్పయ్య అధ్యక్షతన జరిగిన వ్యాయామోపాధ్యాయుల సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్‌గా గుర్రం గోపాలరావు ఎన్నికయ్యారు.